సాక్షి బాపట్ల

గురువారం, 18, మే, 2023



ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు

నగరంపాలెం(గుంటూరు): వేసవి దృష్ట్యా గుంటూరు ట్రాఫిక్ పోలీసులకు బుధవారం ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ కళ్లజోళ్లు, టోపీలను అందించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,200 వరకు పలికింది.



దుర్గమ్మ సేవలో సుబుదేంద్ర

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శ్రీరాఘవేంద్ర స్వామి మఠం మంత్రాలయ మఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామిజీ బుధవారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

లే అవుట్ల పరిశీలన



తాడికొండ: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా సీఆర్డీఏ పరిధిలో కృష్ణాయపాలెం, వెంకటపాలెంలోని లే అవుట్లలో జరుగుతున్న పనులను బుధవారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పరిశీలించారు. అభివృద్ధి పనులు, హద్దురాళ్ల ఏర్పాటు, అప్రోచ్ రహదారుల నిర్మాణం తదితర అంశాలను పరిశీలించారు. సీఆర్‌డీఏ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లకు సంబంధించి ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చేపట్టేందుకు అవసరమైన బహిరంగ సభ ఏర్పాట్లకు స్థల పరిశీలన చేశారు.

నేడు ప్లస్-2 పాఠశాలల్లో పోస్టుల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్–2 తరగతులను బోధించేందుకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు గురువారం ఉదయం 10 గంటలకు గుంటూరు నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు డీఈఓ పి.శైలజ బుధవారం తెలిపారు. తెలుగు 25, ఇంగ్లిష్ 25, గణితం 22, ఫిజిక్స్ 24, కెమిస్ట్రీ 24, బోటనీ 18, జువాలజీ 18, సివిక్స్ ఆరు, కామర్స్ ఆరు చొప్పున పోస్టుల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాగోరు అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ విద్యార్హతలు కలిగి ఉండాలని తెలిపారు. సర్టిఫికెట్లతోపాటు సేవా పుస్తకాన్ని వెంట తీసుకు రావాలని సూచించారు. సీనియారిటీ జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఏఎంసీలో నాబార్డు అధికారుల సందర్శన



తెనాలిటౌన్: తెనాలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డును బుధవారం నాబార్డ్ అధికారులు సందర్శించారు. యార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కమిటీ కార్యాలయంలో అధికారులతో వారు సమావేశమయ్యారు. నాబార్డ్ టెక్నికల్ కన్సల్టెంట్ ఐఎస్ఎన్ రాజు, అసిస్టెంట్ మేనేజర్ సాహు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవిప్రసాద్, పీఆర్‌ఎస్‌ఈ రమేష్, డీఈ రాజు, మార్కెట్ కమిటీ అధికారులతో అభివృద్ధి పనులపై చర్చలు జరిపారు. తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.ఐదు కోట్లు, యార్డు ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.నాలుగు కోట్లు గతంలో ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు తెలిపారు. నిధులు మంజూరు కాగానే ప్రతిపాదన చేసిన పనులు ప్రారంభిస్తామని యార్డు అధికారులు నాబార్డ్ అధికారులకు తెలిపారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి జె.వి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అవుతు నగేష్‌రెడ్డి ఉన్నారు.

శ్రీశైలం గుడికి రూ.13 లక్షల బంగారు పళ్లెం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి బుధవారం గుంటూరుకు చెందిన ఎం.నాగప్రసాద్ బంగారు పళ్లెం విరాళంగా అందజేశారు. కార్యాలయ సమావేశ మందిరంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్నకు ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో దాతలు ఈ పళ్లెం అందించారు. దాతలు మాట్లాడుతూ 245 గ్రాముల బరువు గల పళ్లెం విలువ సుమారు రూ.13.36 లక్షలు ఉంటుందని, దీనిని స్వామిఅమ్మవార్ల పూజా కైంకర్యాలలో వినియోగించాలని కోరారు. అనంతరం దాతలకు శ్రీస్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలను దేవస్థానం తరపున అందజేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే నీటి చేరిక కూడా నిలిచిపోయింది.

చుక్కలనంటిన సంతోషం

- దశాబ్దాల చిక్కులకు పరిష్కారం
- రైతులకే సంపూర్ణ హక్కులు
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం
- ఆనందంలో రైతులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: దశాబ్దాలుగా నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విముక్తి కల్పించింది. ఇన్నాళ్ళు హక్కులు లేక ఇబ్బంది పడిన రైతులకు సంపూర్ణ హక్కులు ఇచ్చింది. ఫలితంగా కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కొనియాడుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 13,946 సర్వేనంబర్ల పరిధిలో 23,406 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, దేవదాయశాఖ, ప్రైవేటు భూములకు చుక్కల జాబితా నుంచి విముక్తి లభించింది. వీటిల్లో 3,672 సర్వేనెంబర్ల పరిధిలో 7,917 ఎకరాల రైతుల భూములు ఉన్నాయి. ఇంకా మిగిలిన చుక్కల భూములకూ త్వరలోనే విముక్తి లభించనుంది. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా చుక్కల భూములు ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో కొంతమేర ఉన్నాయి. వీటన్నింటిని 22ఏ కింద చుక్కలు తొలగించి రైతులకు సర్వహక్కులతో అప్పగిస్తున్నారు. ప్రధానంగా అద్దంకి, మార్టూరు, జేపంగులూరు మండలాల్లో 1,000 ఎకరాలకు పైగా చుక్కల భూములు విముక్తి పొందాయి. చీరాల, వేటపాలెం, బల్లికురవ, కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో 600 నుంచి 850 ఎకరాల వరకు చుక్కల భూముల నుంచి తొలగించారు. రేపల్లె, ఇంకొల్లు, కొరిశపాడు, యద్దనపూడి, పెదగంజాం, వేమూరు, అమృతలూరు, బాపట్ల, నిజాంపట్నం, మండలాల పరిధిలో 50 నుంచి 350 ఎకరాల వరకు చుక్కల భూములు ఉండగా వాటినీ జాబితా తొలగించి రైతులకు అప్పగించారు. జిల్లాలోని 25 మండలాల్లో 17 మండలాల పరిధిలో చుక్కల భూముల సమస్యను ప్రభుత్వం పరిష్కరించింది. మిగిలిన 15,489 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వం, దేవదాయ శాఖ పరిధిలోని భూములనూ చుక్కల జాబితా తొలగించి ఆయా విభాగాలకు అప్పగిస్తున్నారు.

చుక్కల భూములంటే..

బ్రిటిషు కాలంలో సుమారు 100 సంవత్సరాల క్రితం భూసర్వే జరిగినప్పుడు ప్రభుత్వ భూమి, ప్రైవేటు భూమి అని నిర్ధారణ కాకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో (ఆర్‌ఎస్‌ఆర్) పట్టాదారు కాలంలో చుక్కలు పెట్టి వదిలేశారు. అవే చుక్కల భూములయ్యాయి. ఫలితంగా వీటి యజమానులు భూములను అమ్ముకునే హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పైగా గత ప్రభుత్వం ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చింది.

వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక..

చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని నిర్ణయించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా గుర్తింపు ప్రక్రియ చేపట్టింది. తర్వాత 22ఏ (1) (ఈ) నుంచి డీ నోటిఫికేషన్ చేసింది. దీంతో క్రయ, విక్రయాలకు అవకాశమేర్పడింది. పైగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా, ఒక్కరూపాయి ఖర్చుపెట్టకుండా సమస్యను ప్రభు త్వం పరిష్కరించడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



చుక్కలు తొలగించిన భూములు

మండలాలవారీగా విముక్తి లభించిన భూములు ఇలా..

మండలం పేరు	విస్తీర్ణం (ఎకరాల్లో)
అద్దంకి	1193.85
మార్టూరు	1158.26
జేపంగులూరు	1003.04
చీరాల	814.71
వేటపాలెం	782.75
బల్లికురవ	678.75
కారంచేడు	649.56
పర్చూరు	612.25
రేపల్లె	320.74
ఇంకొల్లు	252.95

మిగిలిన ఏడు మండలాల్లో 200 ఎకరాల్లోపు మాత్రమే చుక్కల జాబితా నుంచి తొలగించారు.

రైతుల కష్టాలు తీర్చేందుకే



చుక్కల జాబితా వల్ల చాలా మంది రైతులు భూములపై హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం చుక్కలు తొలగించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పటివరకు జిల్లాలో రైతులకు సంబంధించి 3672 సర్వేనంబర్ల పరిధిలో 7,917 ఎకరాల భూములలో చుక్కలను తొలగించి రైతులకు అందజేశారు. ఇవి కాకుండా పలు ప్రభుత్వ విభాగాల పరిధిలో సుమారు 16 వేల ఎకరాల భూములకు చుక్కలను తొలగించాం.

– శ్రీధర్, జాయింట్ కలెక్టర్

అమరావతిలో పేదలు ఉండటం నేరమా..?

- వచ్చే ఎన్నికల్లో పేదలందరూ చంద్రబాబుకు గుణపాఠం చెబుతారు
- ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. బుధవారం రాత్రి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. అమరావతిలో పేదలు ఉండడం నేరమా అని ప్రశ్నించారు. పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకునేందుకు కోర్టుకెళ్లారని, సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టులా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై విష ప్రచారం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. 2019లో చంద్రబాబు పెత్తందారీ రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తుంటే దానిని కూడా అడ్డుకునేందుకు అమరావతి రైతుల ముసుగులో దొంగ దీక్షలు చేస్తున్న రియల్టర్లకు సుప్రీంకోర్టు తీర్పు మింగుడుపడడం లేదన్నారు. చంద్రబాబు ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడైనా పేదల కోసం ఆలోచించారా అని ప్రశ్నించారు. అవినీతిరహిత పారదర్శక పాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే పచ్చమీడియా బురద జల్లుతోందని విమర్శించారు. 2024లో చంద్రబాబుకు ప్రజలు సరైన బుద్ధి చెప్పి ఇంటికి పంపనున్నారని స్పష్టం చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లోకేష్‌కు కంపులా ఎందుకు అనిపిస్తుందో అర్థం కావడంలేదన్నారు. పేదలను కంపులా ఉచ్చరించడంలోనే లోకేష్ సంస్కృతి ఎలాంటిదో అర్థమవుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షసాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలన్నారు. గత ప్రభుత్వం పేదల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, ఐదేళ్లు అధికారం ఇస్తే గ్రాఫిక్స్ చూపించారే గాని అభివృద్ధి కనుచూపు మేర లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తే 23 సీట్లకే ఎందుకు పరిమితమయ్యారో వారే అర్థం చేసుకోవాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే ఓర్చుకోలేకనే విషప్రచారం చేస్తున్నారని, ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే సరైన రీతిలో బుద్ధి చెబుతారని సునీత పేర్కొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: జగనన్న విదేశీ విద్యాదీవెన ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి జె.రాజా దెబోరా బుధవారం వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రపంచంలో టాప్ 200 లోపు క్యూఎస్ వరల్డ్ ర్యాంకుల్లో ఉన్న విదేశీ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలలో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుందని పేర్కొన్నారు. ఈ వర్గాలకు చెందిన 35 ఏళ్లలోపు వారు జగనన్న విదేశీ విద్యాదీవెన కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియెట్‌లో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్ కలిగి ఉండాలని, ఎంబీబీఎస్ కోర్సుకు నీట్‌లో అర్హత సాధించి ఉండాలని, ప్రపంచంలో టాప్ 100లోపు ర్యాంకు గల విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలలో ప్రవేశం పొందితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వమే వంద శాతం లేదా రూ.కోటి 25 లక్షల ఫీజు చెల్లిస్తుందని వివరించారు. ఇతర వర్గాలకు రూ. కోటి వరకు, 101 నుంచి 200 లోపు ర్యాంకు కలిగిన వాటిలో అడ్మిషన్ పొందితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు 100 శాతం లేదా రూ.75 లక్షల ఫీజు, ఇతర వర్గాలకు 50శాతం ఫీజు లేదా రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు జూన్ 10లోపు హెచ్‌టీటీపీ://జ్ఞానభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆపన్నహస్తం

తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున మంజూరు

బాపట్ల: ఆపన్నులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. మంగళవారం నిజాంపట్నంలో జరిగిన మత్స్యకార భరోసాకు హాజరైన ఆయనకు పలువురు ఆరోగ్య సమస్యలు విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన సీఎం తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.లక్ష మంజూరు చేశారు. సత్వర వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ రంజిత్‌బాషా గురువారం చెక్కులు అందించారు. దీంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల మనోగతం వారి మాటల్లోనే..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన భర్త ఆరోగ్య పరిస్థితి గురించి వివరిస్తున్న వీర్రాజు భార్య

సీఎం ఆదుకున్నారు



మాది నిజాంపట్నం. వేట నిషేధ సమయంలో కరెంటు పని చేస్తుండగా విద్యుదాఘాతంతో కింద పడ్డా. వెన్నెముక దెబ్బతింది. కొంతకాలంగా మంచంలోనే ఉండిపోయాను. కుటుంబం గడవక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. వైద్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నా. ఆయన ఆదుకున్నారు. నాకు న్యాయం జరిగింది.

– కొక్కిలిగడ్డ వీర్రాజు, నిజాంపట్నం

ఈ సాయం మరవలేం



మాది నిజాంపట్నం మండలం కొత్తపాలెం. కండరాల బలహీనతతో బాధపడుతున్నా. డిగ్రీ పూర్తి చేశా. అనారోగ్యంతో ఎక్కడికీ వెళ్లలేని దుస్థితి. వైద్యం చేయిస్తున్నా. కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా. ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థించాం. ఆయన వెంటనే సాయం చేశారు. ఆయన చేసిన సాయాన్ని మరువలేం

– కొక్కిలిగడ్డ విజయరామరాజు, కొత్తపాలెం

భరోసా ఇచ్చారు



మాది కనగాలవారిపాలెం. నా వయసు 32 ఏళ్లు. రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయి. ప్రైవేటు ఉద్యోగం తీసివేశారు. డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తుంది. భార్యాపిల్లలను పోషించుకోలేని స్థితిలో ఉన్నా. కిడ్నీలు తొలగించి నా తల్లి కిడ్నీని వేయడానికి ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించగా, వెంటనే ఆయన స్పందించారు. ఆయనకు కృతజ్ఞతలు.

– కె.బాబూరావు, కనగాలవారిపాలెం

రుణపడి ఉంటాం

నాది చుండూరు మండలం వలివేరు గ్రామం. నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. ఆపై పక్షవాతం వచ్చింది. ప్రమాదవశాత్తు కింద పడిపోయి వెన్నెముక దెబ్బతిని బాధపడుతున్నా. తాత్కాలికంగా వైద్యం చేయిస్తూ మంచానికే పరిమితమయ్యాను. ఏ పనీ చేసుకోలేను. సీఎం నా వైద్యానికి సాయం చేశారు. ఆయనకు రుణపడి ఉంటా.

– బుల్ల శివయ్య, వలివేరు

కొండంత అండ



మాది చుండూరు మండలం వలివేరు. నా కుమార్తె రేచల్‌కు 16 ఏళ్లు. జన్యుపరమైన సమస్యతో ఎదుగుదల లేక ఇబ్బంది పడుతోంది. ఆర్థిక సాయం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశాం. తక్షణం రూ.లక్ష మంజూరు చేశారు. కొండంత అండగా నిలిచారు.

–రవీంద్రబాబు, వలివేరు

నా బిడ్డ ఆరోగ్యానికి జగనన్న అభయం



మాది చెరుకుపల్లి మండలంలోని గుడవల్లి. మా పాప ఐదేళ్ల యామిని అరుదైన బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఏడాది క్రితమే క్యాన్సర్ ఉందని బయటపడింది. ఇప్పటికే వైద్యం కోసం రూ.రెండు లక్షల ఖర్చయింది. మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రిని కోరాం. జగనన్న స్పందించిన తీరు అద్భుతం. ఆయనకు రుణపడి ఉంటాం.

– జె.ప్రేమకుమారి, గుడవల్లి

తెల్లారిన బతుకులు

కూలి కోసం కొండంత ఆశతో వేకువనే బయలుదేరిన ఆ పేద బతుకులపై విధి కన్నెర్రచేసిందో ఏమో.. కబుర్లు చెప్పుకుంటూ సరదాగా ఆటోలో వెళ్తున్న మహిళలపైకి ఒక్కసారిగా లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఆరుగురిని పొట్టనపెట్టుకుంది. ఫలితంగా అప్పటివరకు సాగిన ముచ్చట్లు హాహాకారాలుగా మారాయి. ఆర్తనాదాలై మార్మోగాయి. కొద్దిసేపాగితే పని ప్రదేశానికి చేరుకుంటారనగా ఈ ఘోరం జరిగింది. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమై భయానకంగా మారింది. విషయం తెలిసి గుండెలు బాదుకుంటూ వచ్చిన బంధువుల రోదనలతో దిక్కులు పిక్కటిల్లాయి. ఈ హృదయ విదారక ఘటన దాచేపల్లి మండలం పొందుగల వద్ద బుధవారం ఉదయం జరిగింది.

- రోడ్డుప్రమాదంలో ఆరుగురు మహిళా కూలీలు దుర్మరణం
- పనులకు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో దుర్ఘటన
- మృతులంతా తెలంగాణ వాసులే
- ఆర్తనాదాలతో మార్మోగిన ఘటనాస్థలం



విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

దాచేపల్లి : తెలంగాణలోని నల్గొండ జిల్లా దామచర్ల మండలం నరసపురానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు బుధవారం వేకువ జామునే గురజాల మండలం పులిపాడులో జరుగుతున్న మిర్చి కోతలకు ఆటోలో పయనమయ్యారు. ఆటో దాచేపల్లి మండలం పొందుగల వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో మాలోతు కవిత(45), ఇస్లావత్ మంజుల(30), భూక్యా పద్మ(26), భూక్యా సోనీ(58), వర్తియా సక్రీ(35) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఇస్లావత్ పార్వతి(45)తోపాటు మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పార్వతిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మిగిలిన వారిని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలే

మరణించిన ఆరుగురి కుటుంబాలదీ రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితే. నరసపురంలోని సుగాలీ కాలనీకి చెందిన వీరంతా ఉన్న ఊరిలో వ్యవసాయ పనులు లేకపోవటంతో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పులిపాడుకు కొన్నిరోజులుగా వస్తున్నారు. రోజులాగానే బుధవారం తెల్లవారుజామునే ఆటోలో 12 మంది మహిళా కూలీలు పనులకు బయలుదేరారు. మార్గమధ్యలో ప్రమాదం జరిగి ఆరుగురు మరణించారు. తెల్లవారుజామునే ఇంట్లో నిద్రిస్తున్న బిడ్డలకు ముద్దు ఇచ్చి పనికి ఎల్లొస్త.. అంటూ చిరునవ్వుతో బయలుదేరిన వీరిని ఘటనా స్థలంలో విగతజీవులుగా చూసి వారి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు.

అమ్మా ఒక్కసారి లేవమ్మా..

మంజుల కుమార్తె నాగమణి ఘటనా స్థలంలో రోదించిన తీరు చూపరులను కలచివేసింది. ''బిడ్డా కూలికిపోయొస్త.. మధ్యాహ్నానికి వస్త అని చెప్పావు కదమ్మా.. లెగమ్మా.. నాన్నా అమ్మను ఓ సారి లెగమను'' అంటూ ఆమె విలపించిన తీరు కంటతడి పెట్టించింది. తండ్రి రంగా బిడ్డను అక్కున చేర్చుకుని ధైర్యం చెప్పినా ఫలితం లేకపోయింది. మంజులకు నాగమణితోపాటు కుమారుడు ఈశ్వర్ ఉన్నారు.

- అలాగే ప్రమాదంలో మరణించిన కవితకు భర్త, కృష్ణ, కుమార్తెలు అంజలి, సరిత, కుమారుడు ధనుష్ ఉన్నారు.
- పద్మకు భర్త భిక్షు, కుమారులు దీపక్, విక్షన్, సక్రికి భర్త సక్రు, కుమార్తెలు అంజలి, దేవిక ఉన్నారు.
- సోనీ భర్త చనిపోవడంతో కుమారుల వద్ద ఉంటూ కూలిపనులకు వస్తోంది.

ఒకవైపే రోడ్డు.. ఆపై ఆగి ఉన్న లారీలు

ఏపీ నుంచి తెలంగాణకు వెళ్తున్న ధాన్యం లారీలను సరిహద్దు వద్దే తెలంగాణ ఆర్టీఓ అధికారులు నిలిపివేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి లారీలను నిలిపివేయటంతో పొందుగల గ్రామంలోనూ రోడ్డు పక్కనే లారీలు నిలిచాయి. పిడుగురాళ్ల వైపు నుంచి వస్తున్న ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ధాన్యం లారీలను దాటుకుంటూ వెళ్తున్న నేపథ్యంలో ఎదురుగా తెలంగాణ నుంచి కూలీలతో వస్తున్న ఆటోను గమనించకపోవటంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ధాన్యం లారీలు నిలిపివేయకుంటే ఈ ప్రమాదం జరిగేది కాదని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే నిర్మాణంలో భాగంగా పొందుగల గ్రామంలో రోడ్డు పక్కన ఇళ్లు ఖాళీ చేయించేందుకు గత ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. ఫలితంగా ఒకవైపు మాత్రమే రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ ఇరుకు రోడ్డులోనే వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పరామర్శించిన ఎమ్మెల్యే కాసు, జానారెడ్డి

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

గురజాల : ప్రమాదంలో మరణించిన ఐదుగురి మృతదేహాలకు గురజాల వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తయింది. దీంతో పోస్టుమార్టం గది వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మాజీ మంత్రి కుందురు జానారెడ్డి సందర్శించారు. మృతుల బంధువులను ఓదార్చారు. ఆర్థిక సాయం అందించారు. వీరి వెంట మిర్యాలగూడ ఎమ్మెల్యే నలబోతు భాస్కర్‌రావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ ఉన్నారు.



సీఎం జగన్‌కు ముస్లిం సమాజం రుణపడి ఉంటుంది

మజ్లీసుల్, జమియతుల్ ఉలెమా అధ్యక్షుడు బాసిత్


మాట్లాడుతున్న ముఫ్తీ బాసిత్

లక్ష్మీపురం: హాజీల మక్కా యాత్రకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సమాజం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని జిల్లా మజ్లీసుల్ ఉలెమా, జమియతుల్ ఉలెమా అధ్యక్షుడు ముఫ్తీ బాసీత్ అన్నారు. స్థానిక నల్లచెరువులోని మదర్సాలో బుధవారం ముస్లిం మత పెద్దలు, జమాయతుల్లా, మజ్లీసుల్ ఉలెమా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజీల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. ఈ ఏడాది మక్కా యాత్రకు 1814 మంది హాజీలు వెళ్తుంటే వారికి అన్ని సౌకర్యాలు ప్రభు త్వమే కల్పిస్తోందని తెలిపారు. విజయవాడ విమానాశ్రయంలోని ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే ప్రతి 300 మంది హాజీలకు ఒక ప్రభుత్వ ఉద్యోగిని వలంటీర్‌గా నియమించి ప్రభుత్వ ఖర్చులతో స్టేట్ హజ్ కమిటీ పంపిస్తుందని తెలిపారు. ప్రతి హజ్ యాత్రికుడికి రూ.80 వేల చొప్పున 1813 మంది యాత్రికులపై పడిన పెను భారాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరించి ముస్లిం యాత్రికులకు భారీ ఊరట కల్పించిందని చెప్పారు. హాజీల టికెట్ ధరలో వ్యత్యాసం గురించి సీఎం దృష్టికి సమస్యకు తీసుకుని వెళ్లినపుడు, ఆయన స్పందించి ఏవరు చేయలేని విధంగా ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమియతుల్ ఉలెమా జిల్లా ప్రధాన కార్యదర్శి ఖారి ఉస్మాన్, జిల్లా ముస్లిం మతపెద్దలు, ముఫ్తీలు, హాఫీజ్‌లు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఐబీడీ దూరం

- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధి దరిచేరదు
- 15 నుంచి 40 ఏళ్లలోపు వారే బాధితులు
- రేపు ప్రపంచ ఐబీడీ దినం

గుంటూరు మెడికల్: ఇన్‌ఫ్లామేటరీబోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్న వారి సమస్య రోజురోజుకు ఎక్కువతోందని, సకాలంలో చికిత్స తీసుకోని పక్షంలో దీర్ఘ కాలం వ్యాధి వేధిస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు తెలియజేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పదివేల మిలియన్లకంటే ఎక్కువ మంది వ్యాధి బాధితులు ఉన్నట్లు ది యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ క్రోన్స్ అండ్ అల్సరేటివ్ కొలిటీస్ అసోసియేషన్ పేర్కొంది. ఈవ్యాధిని నియంత్రణలో పెట్టడం తప్ప పూర్తిగా నయం చేయలేరు. ఐబీడీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 2010 నుంచి మే 19న ప్రపంచ వ్యాప్తంగా ఐబీడీ డే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఐబీడీకీ వయస్సుతో సంబంధం లేదు అనే నినాదంతో ఐబీడీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నా రు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బాధితులు


15 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఈవ్యాధి బారిన పడుతున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్క రూ ఈవ్యాధి బాధితులే. కొంత మంది 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సులో వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. గుంటూరు జిల్లాలో పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నా రు. ఒక్కో వైద్యుడు వారంలో ఇద్దరు లేదా, ముగ్గురు ఐబీడీ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో 2020లో 480 మంది, 2021లో 816 మంది, 2022లో 960 మంది బాధితులు చికిత్స పొందారు. ప్రతి ఏడాది వ్యాధి బాధితుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు సూచిస్తున్నారు.

నిర్ధారణ

ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఎమ్మారై, రక్త పరీక్షలు, సిటీస్కాన్, మలహర్ష ద్వారా ఐబీడీ వ్యాధి నిర్ధారిస్తారు.

నల్లపాడుకు చెందిన నాగమల్లేశ్వరరావు కొంతకాలంగా తీవ్ర కడుపు మంటతో బాధపడుతున్నాడు. ఉద్యోగ రీత్యా రాత్రి సమయాల్లో ఎక్కువ సేపు మేలుకొని ఉండటం, సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడంతో ఈ మధ్య కాలంలో సమస్య తీవ్రమైన గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. వైద్యులు పరీక్ష చేసి నాగమల్లేశ్వరరావు ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

గుంటూరు బ్రాడీపేటకు చెందిన చైతన్య ఇంజినీరింగ్ అభ్యసిస్తున్నాడు. ఇటీవల కాలంలో తీవ్రమైన కడుపు మంట సమస్య ఉత్పన్నమవడంతో తల్లిదండ్రులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. ఇంజినీరింగ్ విద్యార్థి ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం, సకాలంలో ఆహారం తీసుకోకుండా చదువు ధ్యాసలో పడి ఒత్తిడికి గురవడం ద్వారా ఐబీడీ వ్యాధి బారిన పడ్డట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.





వ్యాధి లక్షణాలు

క్రాన్స్ వ్యాధి, అల్సరేటివ్ కొలిటీస్ వ్యాధులనే ఐబీడీ వ్యాధిగా పిలుస్తారు. వాంతులు, విరోచనా లు, కొన్నిసార్లు రక్తపు విరోచనాలు, కడుపులో నొప్పి, అకస్మాత్తుగా శరీరం బరువును కోల్పోవడం, కడుపులో మంట, కడుపులో తిమ్మరి, అత్యవసరంగా మలవిసర్జనకు వెళ్లాలనిపించడం, జ్వరం ఈ వ్యాధి లక్షణాలు. వ్యక్తులను బట్టి వ్యాధి లక్షణాలు మారుతూ ఉంటాయి.

కారణాలు

ఐబీడీ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, జన్యుపరమైన కారణాలు, జీవన విధానం, కొన్ని రకాల మందులు మింగడం ద్వారా, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం ద్వారా, ధూమపానం, మద్యపానం, ఒత్తిడి వ్యాధి కారణాలు.

జాగ్రత్తలు అవసరం



ప్రతిరోజూ ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వ్యాయామం, ధ్యానం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. ధూమపానం, మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. సమీకృత ఆహారాన్ని సక్రమంగా నమిలి మింగాలి. సరైన వేళల్లో ఆహారాన్ని తీసుకోవాలి. తిన్న వెంటనే నిద్రించకూడదు. రాత్రివేళల్లో త్వరితగతిన ఆహారం తినాలి. పాల ఉత్పత్తులు పరిమితి మోతాదులో తీసుకోవాలి. కాఫీ, టీలు, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్,
గుంటూరుజీజీహెచ్

సీఎం వైఎస్ జగన్ సభ విజయవంతం

ఎంపీ మోపిదేవి


మాట్లాడుతున్న ఎంపీ వెంకట రమణారావు

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్న మత్స్యకార భరోసా సభను విజయవంతం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నిజాంపట్నంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేపల్లె నియోజకవర్గానికి రావడం తొలిసారిగా పేర్కొన్నారు. మత్స్యకార భరోసా పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉదయం 9.40 గంటల కల్లా నిజాంపట్నం రావడం జరిగిందన్నారు. మండుటెండను లెక్కచేయకుండా వేలాది మంది ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బొర్రా శ్రీనివాసరావు, నాజర్‌ఖాన్, జమీర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యా యత్నం



మార్టూరు: పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తనను అవమానించారంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని రాజుపాలెంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రాజుపాలెం ఎస్టీ కాలనీకి చెందిన కుంటా రాంబాబుకు స్థానిక కొణిదెన రోడ్డులోని ఓ హోటల్ సిబ్బందితో బుధవారం ఉదయం స్వల్ప వివాదం జరిగింది. హోటల్ యాజమాని సమాచారంతో ఎస్ఐ, కానిస్టేబుల్‌ను హోటల్‌కు పంపి రాంబాబును ఉదయం 9 గంటల ప్రాంతంలో స్టేషన్‌కు పిలిపించాడు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో స్టేషన్ నుంచి ఇంటికి చేరిన రాంబాబు భార్య పిల్లలతో ఎస్ఐ తనను గంజాయి కేసు పెట్టి లోపల వేస్తే నీకు దిక్కెవరురా అంటూ తనను దూషించినట్లు కుటుంబ సభ్యులతో చెప్పుకొని బాధపడ్డాడు. ఎస్ఐ అన్నంత పని చేస్తాడని బోరున విలపించినట్లు కుటుంబ సభ్యుల సమాచారం. అనంతరం గ్రామంలోని మెడికల్ షాపుకు వెళ్లి రెండు అట్టల మత్తు టాబ్లెట్‌లు కొనుగోలు చేసి ఇంటికి వచ్చిన రాంబాబు మింగి పడుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న రాంబాబును గమనించిన కుటుంబ సభ్యులు 108 సిబ్బంది సాయంతో మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వివరణ కోసం 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

రేపు జీజీహెచ్‌లో సీఎంఈ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో 19న జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో సీఎంఈ (నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్థోపెడిక్ విభాగాధిపతి, మచిలీపట్నం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఘంటా వరప్రసాద్ చెప్పారు. బుధవారం ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ వైద్య విభాగం సెమినార్ హాలులో పదో సీఎంఈ వర్క్‌షాప్ -2023 జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు జీజీహెచ్ మార్చురీలో మృతదేహాలపై చేసే సర్జరీ శిక్షణ కార్యక్రమాన్ని పీజీవైద్య విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. సీఎంఈ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఇళ్ల స్థలాలకు సుప్రీం పచ్చజెండాపై హర్షం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడికొండ: ఆర్–5 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు సుప్రీంకోర్టు పచ్చజెండా ఊపడం హర్షణీయమని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ తాడికొండ బస్టాండ్ కూడలిలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు క్షీరాభిషేకం నిర్వహించారు. సీఆర్డీయే చట్టంలో పొందుపరచిన విధంగా ఆర్–5 జోన్‌లో పేదలకు పట్టాలిచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దానిపై తప్పుడు కేసులు వేసి పేదలను ఈ ప్రాంతంలో రాకుండా చూడాలనే పన్నాగం పన్నడం దుర్మార్గమన్నారు. రాజధాని అంటే అందరికీ సమాన హక్కులు ఉండాలని, పేదలకు కూడా ఈ ప్రాంతంలో హక్కులు కల్పించేందుకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పేదలు రుణపడి ఉంటారన్నారు. పేదలు రాజధానిలో ఉండకూడదనే అజెండాతో చంద్రబాబు నాయుడు చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని, కులవాదంతో పేదల హక్కులను అడ్డుకోవాలని చూసిన కులవాదులకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. మంచి పాలన ఇస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో 175/175 సీట్లు గెలిచి 50 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండటం ఖాయమనేందుకు నేడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, తాడికొండ, కంతేరు, నిడుముక్కల సర్పంచ్‌లు తోకల సరోజినీ, బెజ్జం మహేష్ బాబు, మాదాసు రత్నకుమారి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, తాళ్ళ శివనాగరాజు, తుళ్లూరు మండల నాయకులు ఆలోకం సురేష్, శృంగారపాటి సందీప్ పాల్గొన్నారు.

తల్లి చెంతకు చేరిన శిశువు

దుర్గి: ఇటీవల మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ గర్భిణి పాపకు జన్మనిచ్చింది. ఆ శిశువును వేరే వ్యక్తులకు అమ్మినట్లు పుకార్లు వచ్చాయి. వివరాలు.. మాచర్ల మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన పనపర్తి సంధ్య కాన్పు కోసం మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 12వ తేదీ చేరింది. గతంలో ఇద్దరు బాలికలు ఉండగా మూడో కాన్పులో కూడా ఆడపిల్ల పుట్టింది. ముగ్గురు ఆడ పిల్లలను పోషించడం భారమని భావించి తన భర్తకు పరిచయమున్న దుర్గి గ్రామానికి చెందిన తుపాకుల కోటేశ్వరరావు దంపతులకు మూడు రోజుల శిశువును వారికి అప్పగించారు. ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న కోటేశ్వరరావుకు సంతానం లేదు. విషయం తెలుసుకున్న సీడీపీఓ అధికారులు, ఘటనపై ఆరా తీశారు. ఇద్దరు ఇష్టపూర్వకంగా శిశువును తీసుకున్నట్లు వారు సీడీపీఓ అధికారులకు వివరించారు. శిశువును తల్లి పనపర్తి సంధ్య చెంతకు చేర్చినట్లు సీడీపీఓ ఇన్‌చార్జి లీలావతి, సూపర్‌వైజర్ దుర్గ తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లలు దత్తతకు కావలసిన సందర్భంలో చట్టం పరిధిలో ఇద్దరు తల్లిదండ్రులు అంగీకారంతో న్యాయబద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులతో పాటు స్టేషన్ రైటప్ సైదా నాయక్ ఉన్నారు.

గంగపుత్రుల పాలిట వరం మత్స్యకార భరోసా

- బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో గంగపుత్రులకు ప్రాధాన్యం
- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



కొరిటిపాడు: లంచాలకు, వివక్షకు తావు లేకుండా.. అర్హులైన వారందరికీ నిర్దిష్ట ప్రణాళికతో ప్రభుత్వం సాయం చేయడం అనేది గొప్ప విషయమని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. కంకరగుంట గేటు సమీపంలోని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా ఐదోసారి రాష్ట్ర వ్యాప్తంగా సముద్రంపై వేటకు వెళ్లే 1,23,519 మత్స్యకార కుటుంబాలకు రూ.123.52 కోట్ల ఆర్థిక సాయం అందించడం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యపడిందని చెప్పారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సముద్రంపై వేటకు వెళ్లే మత్స్యకారుల స్థితిగతులను మెరుగుపరిచి, వలసలను అరికట్టే లక్ష్యంతో ఈ ప్రభుత్వం రూ.3,767.48 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌లాండింగ్ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. అధికారంలోకి వచ్చి నాటి నుంచి వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతి రూ.10 వేలకు అంటే రెండున్నర రెట్లు పెంపు, అర్హత, నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసి, మన వాళ్లకు మెరుగైన ఫిషింగ్ చేసుకునే పరిజ్ఞానం పెరిగేలా పశ్చిమగోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ విశ్వవిద్యాలయం, ఆర్బీకేలలో ఫిషరీస్ అసిస్టెంట్స్ నియామకం వంటి నిర్ణయాలతో సీఎం వై.ఎస్.జగన్ పాలన గంగ పుత్రుల పాలిట సువర్ణ యుగాన్ని తలపిస్తోందన్నారు. 2018లో పాకిస్థాన్ భద్రతా దళాలకు పట్టుబడి 13 నెలలు కరాచీ జైలులో గడిపిన 23 మంది మత్స్యకారులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, విదేశాంగ శాఖతో మంతనాలు జరిపి వారిని విడుదల చేయించడంలో సఫలీకృతమైన వై.ఎస్.జగన్ సమర్థత ఓ నూతన చరిత్ర అని అభివర్ణించారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా స్ఫూర్తిని కొనసాగిస్తూ బజరంగ్ ఫౌండేషన్ బాపట్ల మండలంలోని గంగపుత్రుల సేవ కోసం ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి 6న ముత్తాయపాలెంలో వెయ్యి మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి, వారిలో కళ్లజోళ్లు అవసరమైన 600 మందికి ప్రత్యేకంగా తయారు చేసిన కళ్లజోళ్లు అందజేసినట్లు తెలిపారు.